సాక్షి నిర్మల్

శనివారం । 6 । మే । 2023



ఉపాధ్యాయ శిక్షణ పిలుస్తోంది..!
ఇంటర్ పూర్తి చేసినవారికి డీఈఈలో ప్రవేశానికి ప్రభుత్వం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోంది. ఇందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తోంది. 8లో▸



నీలగిరి సాగుతో లాభాలు 8లో▸
నీలగిరి సాగు చేసి లాభాలు గడించాలని సిర్పూర్ పేపర్ మిల్లు డీజీఎం సురేందర్ నర్కుడే సూచించారు. లోతర్యతండాలో ఆగ్రోఫారెస్ట్రీ తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు.

గరిష్టం/కనిష్టం
35.0 /26.0

వాతావరణం
ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. పగలు ఉక్కపోతగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పలుచోట్ల వానలు పడే అవకాశముంది.

న్యూస్‌రీల్

బయల్పడిన హనుమాన్ విగ్రహం!

- గోప్యంగా తరలించిన అధికారులు


హనుమాన్ విగ్రహం

భైంసాటౌన్: పట్టణంలోని మైసమ్మగుట్ట సమీపంలోని బోడగుట్టపై హనుమాన్ విగ్రహం బయల్పడిందన్న సమాచారం శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కొందరు భక్తులు తరలి వచ్చి గుట్టపై హనుమాన్ విగ్రహానికి పూజలు చేశారన్న సమాచారంతో పట్టణ సీఐ ఎల్ శ్రీను, మున్సిపల్ అధికారులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఎలాంటి సమస్య తలెత్తకుండా గుట్ట వద్ద పోలీసు ఆంక్షలు అమలు చేశారు. గుట్టపైకి ఎవరినీ అనుమతించకుండా అక్కడి నుంచి పంపించివేశారు. అనంతరం హనుమాన్ విగ్రహాన్ని అక్కడి నుంచి గోప్యంగా తరలించి ఓ ఆలయంలో భద్రపరిచినట్లు తెలిసింది.

కూలీల హాజరుశాతం పెంచాలి


మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

కడెం: ఉపాధి కూలీల హాజరుశాతం పెంచాలని, ప్రతీ జీపీలో రోజుకు 200 మంది కూలీలకు పని కల్పించాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఖానాపూర్, కడెం, దస్తురాబాద్, పెంబి మండలాల ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. అంతకుముందు మండలంలోని కొత్తమద్దిపడగ గ్రామంలో ఉపాధిహామీలో భాగంగా చేపడుతున్న నీటి కుంటల పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. అనంతరం నచ్చన్‌ఎల్లాపూర్‌లో పర్యటించి, ఉపాధి కూలీలకు అంబలి పంపిణీ చేస్తున్న సర్పంచ్ బొడ్డు గంగన్నను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏపీవో జయదేవ్ తదితరులున్నారు.

ఆహారం కల్తీ చేస్తే చర్యలు


నిర్మల్: ఆహార పదార్థాలు, తినుబండారాలు కల్తీ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ వాసురాం హెచ్చరించారు. గతంలో నమోదైన ఏడు కేసులను శుక్రవారం విచారించిన అడిషనల్ కలెక్టర్ రాంబాబు రూ.4.11లక్షల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ మాట్లాడుతూ.. ప్రతీ వ్యాపారి ఫుడ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు.

హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్‌లో ప్రవేశానికి ఎంపిక


సమంతతో అదనపు కలెక్టర్ రాంబాబు

నిర్మల్‌చైన్‌గేట్: బేగంపేట్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశం కోసం శుక్రవారం అదనపు కలెక్టర్ పీ రాంబాబు తన చాంబర్‌లో లక్కీ డ్రా నిర్వహించి ఒకరిని ఎంపిక చేశారు. కోరిటికల్ గ్రామానికి చెందిన దేవ్సత్ల సమంత ఎంపికైనట్లు తెలిపారు.

బాసరలో భక్తుల రద్దీ


కూతురితో అక్షరాభ్యాసం చేయిస్తున్న మహేశ్

భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి సెలవులు కావడంతో భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ముందుగా గోదావరినదిలో పుణ్యస్నానాలాచరించారు. చిన్నారులతో అక్షర శ్రీకార పూజలు జరిపించారు. జబర్దస్త్ కమెడియన్ మహేశ్ అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. కూతురితో అక్షరాభ్యాసం చేయించారు.

త్వరగా పనులు పూర్తి చేయాలి


సిబ్బందితో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

కడెం: మండలంలోని కొత్త మద్దిపడగ సమీపంలో రాంపూర్, మైసంపేట్ గ్రామస్తులకు ఏర్పాటు చేస్తున్న పునరావాస కాలనీ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎఫ్‌డీపీటీ వినోద్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం పునరావాస కాలనీ పనులను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పనులు ఆలస్యం చేయవద్దని, జూన్‌లోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఎఫ్‌డీవో కోటేశ్వర్‌రావు, ఎఫ్ఆర్వో అనిత, అటవీ, పంచాయతీరాజ్ సిబ్బంది ఉన్నారు.

క్రీడోత్సవం



- ఈ నెల 15నుంచి సీఎం కప్ టోర్నీలు
- మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు
- నిర్వహణకు మండల, జిల్లా కమిటీలు
- జూన్ 2న విజేతలకు బహుమతులు


జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న కలెక్టర్ ఎస్పీ

నిర్మల్‌చైన్‌గేట్: గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15 నుంచి 31వ తేదీ వరకు సీఎం కప్ పేరిట క్రీడా పోటీలు నిర్వహించనుంది. మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో వ్యక్తిగత, జట్టు విభాగాల్లో వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు భారీ నగదు పురస్కారాలు అందజేయనుంది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ ముఖ్య కార్యదర్శి, క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా కార్యాచరణను ప్రకటించారు. జూన్ 2వ తేదీన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రస్థాయిలో విజేతలకు బహుమతులను ప్రదానం చేయనున్నారు. కాగా, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో అధికారులతో పోటీల నిర్వహణ కమిటీలు ఏర్పాటు చేసి ప్రకటించారు. 15–36 ఏళ్ల మహిళలు, పురుషులు పోటీలకు అర్హులుగా తెలిపారు.

15నుంచి మండల స్థాయి పోటీలు
ఈ నెల 15, 16, 17 తేదీల్లో మండలస్థాయి సీఎం కప్ టోర్నీలు నిర్వహించనున్నారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తారు. మండలస్థాయి విజేత జట్లను జిల్లాస్థాయి పోటీలకు పంపుతారు. మండలస్థాయిలో ఈ పోటీల నిర్వహణ కోసం కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఎంపీపీ చైర్మన్, ఎంపీడీవో మెంబర్ కన్వీనర్, జెడ్పీటీసీ, తహసీల్దార్, ఎంఈవో లేదా గజిటెడ్ హెచ్‌ఎం, ఎస్ఎస్ఐ, మున్సిపల్ ఏరియాలో కమిషనర్, పీడీ లేదా పీఈటీ సభ్యులుగా ఉంటారు.

22నుంచి జిల్లాస్థాయి పోటీలు
జిల్లాస్థాయిలో 11 క్రీడాంశాల్లో పోటీలను ఈ నెల 22నుంచి 24 వరకు నిర్వహించనున్నారు. పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్‌తో పాటు పురుషులకు బాక్సింగ్, రెజ్లింగ్ పోటీలు ఉంటాయి. జిల్లాస్థాయిలో సీఎం కప్ క్రీడాపోటీల నిర్వహణ కోసం కలెక్టర్ చైర్మన్, ఎస్పీ వైస్ చైర్మన్ అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) కో వైస్ చైర్మన్, డీవైఎస్వో లేదా కార్యదర్శి, జిల్లా విద్యాశాఖాధికారి, జనరల్ మేనేజర్ ఇండస్ట్రీస్, మున్సిపల్ కమిషనర్ సభ్యులుగా ఉంటారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన జట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయి.

రాష్ట్రస్థాయి విజేతలకు బహుమతులు ఇలా..

వ్యక్తిగత విభాగంలో..
- ప్రథమ స్థానానికి రూ.20 వేలు
- ద్వితీయ స్థానానికి రూ.15 వేలు
- తృతీయ స్థానానికి రూ.10 వేలు

జట్టు విభాగంలో..
- ప్రథమ స్థానానికి రూ.లక్ష
- ద్వితీయ స్థానానికి రూ.75 వేలు
- తృతీయ స్థానానికి రూ.50 వేలు

పోటీలు నిర్వహించే తేదీలు
మండల స్థాయి: ఏప్రిల్ 15 నుంచి 17 వరకు
జిల్లా స్థాయి: ఏప్రిల్ 22 నుంచి 24 వరకు
రాష్ట్ర స్థాయి: ఏప్రిల్ 28 నుంచి 31 వరకు

28నుంచి రాష్ట్రస్థాయి పోటీలు
రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాశాఖ మంత్రి చైర్మన్‌గా, శాట్స్ చైర్మన్ కో చైర్మన్, ప్రిన్సిపల్ సెక్రటరీ వైస్ చైర్మన్‌గా, శాట్స్ ఎండీ కన్వీనర్‌గా, తెలంగాణ ఒలింపిక్ సంఘం అధ్యక్షులు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, కమిషనర్ మున్సిపల్, కమిషనర్ పంచాయతీరాజ్ కమిషనర్ జీహెచ్‌ఎంసీ, డిప్యూటీ డైరెక్టర్లు సభ్యులుగా వ్యవహరిస్తారు. 18 క్రీడాంశాల్లో పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, ఆర్చరీ, జిమ్నాస్టిక్స్, లాన్ టెన్నిస్, షూటింగ్, టేబుల్ టెన్నిస్‌తో పాటు పురుషులకు ఫుట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్, హాకీ, వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



పల్లె క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉంది. వేసవి సెలవుల్లో క్రీడా సందడి మొదలుకానుంది. యువత ఈ పోటీలను సద్వినియోగం చేసుకోవాలి.
– కుమ్మరి భోజన్న, పెటా జిల్లా సెక్రటరీ

పోటీల్లో రాణించాలి



చాలా రోజుల తర్వాత గ్రామీణ స్థాయి నుంచి జరుగుతున్న క్రీడా పోటీలతో పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొననుంది. క్రీడాకారులు మండల, జిల్లా స్థాయి పోటీలను సద్వినియోగం చేసుకుని ప్రతిభ కనబర్చాలి. రాష్ట్రస్థాయిలోనూ రాణించాలి.
– జమున, పీఈటీ, ముజ్గి హైస్కూల్

గ్రామీణ క్రీడాకారులకు వరం

సీఎం కప్ క్రీడాపోటీలు గ్రామీణ క్రీడాకారులకు వరం. రాష్ట్ర మంత్రి, కలెక్టర్ ఆదేశాలతో మండల, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తాం. ఇందులో రాణించే క్రీడాకారులకు భవిష్యత్‌లో మంచి అవకాశాలు లభిస్తాయి. క్రీడాకారులు మండల, జిల్లాస్థాయిలో సీఎం కప్ క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలి.
– క్రాంతికుమార్, జిల్లా ఇన్‌చార్జి యువజన క్రీడల అధికారి

వేసవి శిబిరంతో వెలుగులోకి క్రీడాకారులు

- రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం


దుస్తులు పంపిణీ చేస్తున్న మంత్రి ఐకేరెడ్డి, కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: వేసవి క్రీడా శిక్షణ శిబిరాలతో ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ, న్యాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో విద్యార్థులు మొబైల్ ఫోన్లు, టీవీలకు బానిసలు కాకుండా శారీరక, మానసిక పరిపక్వతను పెంచే క్రీడలు నేర్పించే దిశగా జిల్లాలో 'నిర్మల్ సమ్మర్ క్యాంపు', 'టీచ్ నిర్మల్ కార్యక్రమం' ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామపంచాయతీల పరిధిలో 110, మున్సిపల్ పరిధిలో 16 క్యాంపులు ఏర్పాటు చేశామని, ఉదయం 7నుంచి 10గంటల వరకు వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, క్రికెట్, కరాటే, చెస్, క్యారమ్స్, సాఫ్ట్‌బాల్, రన్నింగ్, ఖోఖో, లాంగ్ జంప్ తదితర క్రీడలు, టీచ్ నిర్మల్ కార్యక్రమంలో భాగంగా ఆంగ్లం, గణితం, విజ్ఞానశాస్త్రం లాంటి విషయాల్లో ప్రాథమిక భావనలు నేర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు పీడీలు, పీఈటీలు, వలంటీర్లను నియమించినట్లు తెలిపారు. విద్యార్థులంతా ఆటల ప్రాముఖ్యతను గ్రహించి క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ఎన్టీఆర్ స్టేడియాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. చించోలి ప్రాంతంలో ఐదెకరాల్లో రూ.8 కోట్లతో చేపట్టనున్న స్టేడియం నిర్మాణానికి ఈ నెల 15న రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. మే 31వరకు వేసవి శిబిరాలు కొనసాగుతాయని, క్యాంపుల్లో అన్ని సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. జెడ్పీ సీఈవో సుధీర్, డీఈవో రవీందర్‌రెడ్డి, రామ్‌కిషన్‌రెడ్డి, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా క్రీడల అధికారి క్రాంతికుమార్, తహసీల్దార్ సుభాష్‌చందర్, ఎంఈవోలు, సెక్టోరల్ అధికారులు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రమణారావు, పీడీలు, వలంటీర్లు, వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కమనీయం.. లక్ష్మీనారసింహుడి కల్యాణం


వేడుకకు హాజరైన భక్తజనం

- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి అల్లోల
- కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


స్వామివారి కల్యాణంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

దిలావర్‌పూర్: మండలంలోని కాల్వ గ్రామ పరిసర అటవీప్రాంతంలో కొలువుదీరిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం స్వామివార్ల కల్యాణ ఘట్టాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆలయంలో స్వామివార్ల ఉత్సవవిగ్రహాలను రథంపై కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఖానాపూర్‌కు చెందిన వేదపండితులు వాసుదేవాచార్యులు, చక్రపాణి నరసింహమూర్తి స్వామివార్ల కల్యాణ ఘట్టాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. 20వేలకు పైగా భక్తులు హాజరయ్యారు. భక్తులు, స్వామివార్లకు కట్నకానుకలు సమర్పించారు. ఎస్సై గంగాధర్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఐకేరెడ్డి మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి మరిన్ని నిధులు సమకూర్చనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండపాన్ని అభివృద్ధి చేస్తామని, కార్యాలయ గదులు, కాటేజీల నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మల చిన్నయ్య, ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, సర్పంచ్ ఆడెపు తిరుమల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ పీవీ రమణారెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బాబురావు పాల్గొన్నారు. బీజేవైఎం మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి కుటుంబ సమేతంగా హాజరై మొక్కు తీర్చుకున్నారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సుభాష్‌రావు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


సోన్‌లో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఐకేరెడ్డి

సోన్: మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం కొమురంభీమ్ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. మున్నూరుకాపు సంఘ భవనంలో 60మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఆర్డీవో స్రవంతి, తహసీల్దార్ హిమబిందు, జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, సర్పంచ్ వినోద్‌కుమార్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మొయినొద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ
మామడ: మండలంలోని 82మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చెక్కులు పంపిణీ చేశారు. ఆర్డీవో స్రవంతి, నాయకులు రాంకిషన్‌రెడ్డి, లింగారెడ్డి, గంగారెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, హన్మాగౌడ్, వికాస్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దిగిన లిక్కర్ ధర


వైన్స్‌లో మద్యం బాటిళ్లు

- ఫుల్‌బాటిల్‌పై రూ.40 డౌన్
- అమ్మకాలు తగ్గడంతో ప్రభుత్వ నిర్ణయం
- నేటి నుంచి అమలులోకి

సాక్షి, ఆదిలాబాద్: మందు బాబులకు సర్కారు తీపి కబురు అందించింది. లిక్కర్ ధర తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఫుల్‌బాటిల్‌పై రూ.40 తగ్గనుంది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో లిక్కర్ సేల్స్ ద్వారా ప్రభుత్వానికి నాలుగు శాతం ఆదాయం పెరిగింది. అయినా అమ్మకాలు మాత్రం పడిపోయాయి. ఇది ఎలాగని ఆశ్చర్యపోతున్నారా.. ఏడాది క్రితం ప్రభుత్వం వీటి ధరలు పెంచింది. ఆ కారణంగా అమ్మకాలు తగ్గినా ఆదాయం పెరిగింది. అయితే ప్రభుత్వ లక్ష్యం భిన్నంగా ఉంటుంది. అమ్మకాలతో పాటు ఆదాయమూ పెరగాలి. అయితే ఇక్కడ సేల్స్ తగ్గిపోవడం, ఆదాయం నామమాత్రంగా పెరగడం కారణంగా ప్రభుత్వం తాజాగా ధరల విషయంలో దిగివచ్చింది. దీనికి సంబంధించి జీవో జారీ అయినట్లు అధికారులు చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 192 వైన్స్‌లు, 39 బార్‌లు ఉన్నాయి. వీటి ద్వారా 2021–22 తో పోల్చితే 2022–23లో ఇండియన్ మేడ్ లిక్కర్ (ఐఎంఎల్) కేసుల అమ్మకాలు 3లక్షల 2వేల 933 తగ్గాయి. ఇంత పెద్ద మొత్తంలో తగ్గడంతో ఎక్సైజ్ అధికారులు తలపట్టుకోవాల్సిన పరిస్థితి. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి స్థితే ఉండడంతో ఎక్కడో పొరపాటు జరిగిందనేది ప్రభుత్వం తర్జనభర్జన పడింది. ప్రధానంగా గతేడాది ప్రభుత్వం లిక్కర్ ధరలను అమాంతంగా పెంచింది. ఇది పొరుగు రాష్ట్రాల్లో ధరలతో పోల్చితే అధికంగా ఉండడంతో మందుబాబులు సరిహద్దుకు వెళ్లినప్పుడు అక్కడి నుంచి కొనుగోలు చేయడంతోనే ఇలాంటి పరిస్థితి ఉత్పన్నమైందని ప్రభుత్వం దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ధరల తగ్గింపుపై దృష్టి సారించింది. అయినా మహారాష్ట్రతో పాటు ఇప్పటికీ అధికంగా ఉన్నాయన్న అభిప్రాయం మందుబాబుల్లో వ్యక్తమవుతోంది.

చీప్‌లిక్కర్‌పైనే ప్రభావం..
సాధారణంగా ఐఎంఎల్, బీర్ కేసుల అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుంది. అయితే ఐఎంఎల్ అమ్మకాలే అధిక ఆదాయానికి దోహద పడుతాయి. బీర్ల అమ్మకాలు పెరిగినా ఐఎంఎల్ సేల్స్ తగ్గిపోవడం ప్రభుత్వాన్ని ఆలోచనలో పడేసింది. ప్రధానంగా చీప్ లిక్కర్ అమ్మకాలు తగ్గడంతో ఆదాయంపై తీవ్ర ప్రభావం కనిపిస్తోంది. లిక్కర్ ధర రూ.400 లోపు ఉన్నది చీప్‌లిక్కర్‌గా పరిగణిస్తారు. రూ.700లోపు ఉన్నదాన్ని మీడియం లిక్కర్‌గా, రూ.850 పైన దాన్ని ప్రీమియం లిక్కర్‌గా పరిగణిస్తారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 49శాతం చీప్ లిక్కర్ అమ్మకాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తగ్గిపోయాయి. ఇది భారీగా రావాల్సిన ఆదాయంపై ప్రభావం చూపుతోంది. మీడియం లిక్కర్ 17శాతం, ప్రీమియం లిక్కర్ 12 శాతం అమ్మకాలు తగ్గాయి. మొత్తంగా లిక్కర్ సేల్స్‌పై ధరల పెంపు ప్రభావమే కనిపించిందని ఎక్సైజ్ అధికారులు బాహాటంగానే పేర్కొంటున్నారు. దీంతోనే ఆదాయం తగ్గిందని వారు చెబుతున్నారు.

మద్యం ధరలు తగ్గింపు



లిక్కర్ ధరలను ప్రభుత్వం తగ్గిస్తూ జీవో జారీ చేసింది. తగ్గిన ధరలు శనివారం నుంచి అమలులోకి రానున్నాయి. ఫుల్‌బాటిల్‌పై రూ.40, హాఫ్‌పై రూ.20, క్వార్టర్‌పై రూ.10 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే పాత స్టాక్ అదే ధరలపై అమ్మడం జరుగుతుంది. కొత్త స్టాక్ వచ్చిన తర్వాత నూతన ధరలు అమల్లోకి వస్తాయి.
– నర్సింహారెడ్డి, డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్‌శాఖ

లిక్కర్, బీర్ కేసుల అమ్మకాలు.. ఆదాయం

సంవత్సరం	ఐఎంఎల్ కేసులు	బీర్ కేసులు	ఆదాయం (రూ. కోట్లలో)
2021–22	21,75,425	17,47,653	1649
2022–23	18,72,492	22,77,981	1716
వ్యత్యాసం	3,02,933	5,30,328	67
శాతం	–14	30	4



వచ్చేది డబుల్ ఇంజన్ సర్కారే

- ఎంపీ సోయం బాపూరావు
- గడపగడపకూ బీజేపీ ప్రారంభం


మోహన్‌రావుపటేల్‌తో కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎంపీ సోయం

కుంటాల: రాష్ట్రంలో వచ్చేది డబుల్ ఇంజన్ సర్కారేనని ఎంపీ సోయం బాపూరావు ధీమా వ్యక్తంజేశారు. సీఎం కేసీఆర్ పాలనకు స్వస్తి పలకాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ సీనియర్ నాయకుడు బోస్లే మోహన్‌రావు పటేల్ చేపట్టిన 'పల్లెపల్లెకు బీజేపీ.. గడపగడపకూ మోహన్‌రావు' కార్యక్రమాన్ని సూర్యాపూర్‌లో ఎంపీ శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు ముథోల్ నియోజకవర్గ ప్రజల కష్టసుఖాలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం తలపెట్టినట్లు వెల్లడించారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవడంలో విఫలమైందని ఆరోపించారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు సూర్యాపూర్ రాజరాజేశ్వరాలయంలో ఎంపీతో కలిసి మోహన్‌రావుపటేల్ పూజలు చేశారు. కార్యకర్తలతో కలిసి హనుమాన్ చాలీసా పఠనం చేశారు. గ్రామంలో బీజేపీ జెండా ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. సర్పంచ్ చంద్రకాంత్ పటేల్, ఎంపీటీసీ కట్ట రవి, పార్టీ జనరల్ సెక్రటరీ గంగాధర్, కౌన్సిలర్లు గాలి రవి, కపిల్ సిందే, మాజీ ఎంపీపీ సుభాష్‌పటేల్, నాయకులు కుభీర్ రాజన్న, జక్కుల గజేందర్, సాయినాథ్, లక్ష్మణ్‌పటేల్, సుదర్శన్‌పటేల్, సురేశ్, మహేశ్, సోమ సత్తయ్య, నరహరి పటేల్, దేవదాస్ పటేల్, మాధవ్‌రావు, రాజన్న, రామకృష్ణ పాల్గొన్నారు.



నిర్మల్ పట్టణంలోని రోడ్లపై ఓ రైలుబండి చక్కర్లు కొట్టింది. ఇది నిజం రైలు కాదు లెండి.. ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం అడ్మిషన్ల కోసం ప్రచారం చేసేందుకు తయారు చేయించిన డమ్మీ రైలు. శుక్రవారం ఇలా రోడ్లపై తిప్పి ప్రచారం చేశారు. దీనిని పలువురు ఆసక్తిగా తిలకించగా, మరికొందరు వేసవి సెలవుల్లో విద్యార్థులతో ప్రచారం చేయించడాన్ని తప్పుపట్టారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

క్లుప్తంగా

ఎస్టీ హోదా సాధించే దాకా పోరాటం

- మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే



మాట్లాడుతున్న సుకుమార్ పేట్కులే

తలమడుగు: మాలీలకు ఎస్టీ హోదా దక్కే వరకు పోరాటం ఆగదని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే అన్నారు. మండలంలోని బరంపూర్ బస్టాండ్ ప్రాంగణం వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పులే దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించి మాట్లాడారు. పూలే దంపతుల స్ఫూర్తితో 22 ఏళ్లుగా మాలీ సంఘం పోరాటాలు సాగిస్తున్నదన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న షిండే, కోశాధికారి సతీశ్, సర్పంచ్ భగీరథ బాయి, ఉపసర్పంచ్ నారాయణరెడ్డి, కేదారేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీడీ దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ డీడీ ఎం.దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక కేబీ కాంప్లెక్స్ మైదానంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాల విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న క్రీడల శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 25 వరకు నిర్వహించనున్న శిబిరాల్లో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు చెందిన 85 మంది హాజరవుతన్నారన్నారు. వీరికి వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ వంటి క్రీడా అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, కోచ్‌లు సునంద్, శివ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ జంగ్‌సైరన్ జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బొజ్జు

ఖానాపూర్: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ఈ నెల 8న తలపెట్టిన నిరుద్యోగ జంగ్‌సైరన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు కోరారు. శుక్రవారం పట్టణంలోని జేకే ఫంక్షన్‌హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగులకు అడుగడుగునా అన్యాయం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ సభ కనువిప్పు కావాలన్నారు. నిరుద్యోగ సమస్యపై ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. పాలకుల వైఫల్యంతో నేడు నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంజేశారు. నిరుద్యోగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. నాయకులు దయానంద్, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేశ్, హేమంత్‌చారి, రాజునాయక్, జంగిలి శంకర్, రాజేశ్వర్, మల్లేశ్, తోట సత్యం, జహీర్‌హైమద్, సలీంఖాన్, రాసమల్ల అశోక్, శ్రీనివాస్, ఉత్తమ్, జయవంత్‌రావ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ శిక్షణ పిలుస్తోంది..!



- డీఎడ్‌కు దరఖాస్తుల ఆహ్వానం
- ఉమ్మడి జిల్లాలో ఏడు కళాశాలలు
- అందుబాటులో 500 సీట్లు
- ఈ నెల 22వరకు దరఖాస్తు గడువు

నిర్మల్ ఖిల్లా: సమాజంలో ఉపాధ్యాయులంటే గౌరవం ఎక్కువ. అందుకే తల్లిదండ్రుల తర్వాత స్థానం ఉపాధ్యాయులకిచ్చారు. ఈ వృత్తి.. సమాజంలో ఓ బృహత్తర బాధ్యత. ఉపాధి కల్పించే మార్గం కూడా.. ఇటు ప్రభుత్వ రంగంలో వేలసంఖ్యలో ఖాళీలు భర్తీ చేస్తుండగా.. అటు ప్రైవేట్ రంగంలోనూ అవకాశాలు పుష్కలంగా ఉంటున్నాయి. ఇటీవలి కాలంలో విద్యారంగం విస్తరిస్తుండడం .. అమల్లోకి వచ్చిన విద్యాహక్కు చట్టంతో అవకాశాలు పెరిగిపోతున్నాయి. చిన్న వయస్సులో ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగు పెట్టాలనుకునే వారికి ప్రభుత్వం మంచి అవకా శాన్ని కల్పిస్తోంది. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారికి డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఈ) రెండేళ్ల కోర్సులో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోంది. గతంలో టీటీసీ పేరుతో ఉండే ఈ కోర్సును ప్రస్తుతం డీఎడ్‌గా వ్యవహరిస్తున్నారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ వృత్తిని చేపట్టే వారికి డీఎడ్ అర్హత అవసరం. ప్రాథమిక పాఠశాలల్లో విద్యా బోధనకు ఇంటర్మీడియట్‌తో పాటు డీఎడ్ ఉత్తీర్ణులై ఉండాలి. ఆ తర్వాత టెట్, టీఆర్టీ (డీఎస్సీ) ద్వారా ఉపాధ్యాయులుగా నియామకం చేస్తారు. ఇప్పటికే ఇంటర్మీడియట్ పూర్తి చేసినవారు, ఈ ఏడాది ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసినవారు డీఈఈ సెట్‌కు అర్హులు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏడు డీఎడ్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో ప్రభుత్వ డైట్‌తోపాటు మరో ప్రైవేట్ కళాశాల ఉండగా, భైంసా, నిర్మల్ మంచిర్యాల, ఉట్నూర్, ఆసిఫాబాద్ ప్రాంతాల్లో మరో ఐదు ప్రైవేట్ కళాశాలలున్నాయి.

దరఖాస్తులు ప్రారంభం: ఏప్రిల్ 22
తుది గడువు: మే 22
హాల్‌టిక్కెట్లు డౌన్లోడ్ చేసుకోవడం: మే 27
ఆన్‌లైన్ పరీక్ష తేదీ: జూన్ 1
ఫలితాల ప్రకటన: జూన్ 8
ధ్రువీకరణ పత్రాల పరిశీలన, వెబ్ ఆప్షన్లు, సీట్లు/కళాశాలల కేటాయింపు: జూన్15 నుంచి జూలై 5 వరకు
తరగతులు ప్రారంభం: జూలై 12 నుంచి

ఇవీ.. కోర్సు వివరాలు

ఇంటర్‌తో ప్రభుత్వ ఉద్యోగాన్ని అందించే కోర్సు ఇది. రెండేళ్ల వ్యవధి గల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈడీ) ప్రథమ సంవత్సరంలో విద్యా మనో విజ్ఞానశాస్త్రం, విద్యాతత్వ శాస్త్రం, జనరల్ అంశాలైన పూర్వ ప్రాథమిక విద్య-ప్రస్తుత విద్య, ఆరోగ్యం, విద్య-కంప్యూటర్ ఎడ్యుకేషన్, వయోజనవిద్య తదితర సబ్జెక్టులు ఉంటాయి. రెండో సంవత్సరంలో తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్, సోషల్ సబ్జెక్టుల బోధన పద్ధతులను బోధిస్తారు. కోర్సులో భాగంగా టీచింగ్ ప్రాక్టీస్ 75 రోజులు ఉంటుంది. ఇందులో 35 రోజులు ప్రాథమిక పాఠశాలలు, 10 రోజులు ప్రాథమికోన్నత పాఠశాలల్లో బోధించాలి. 30రోజులపాటు పాఠశాలల్లో ఇంటర్న్‌షిప్ ఉంటుంది. డీఈడీ ఉత్తీర్ణులు ప్రభుత్వం నిర్వహించే ఉపాధ్యాయ నియామక పరీక్ష డీఎస్సీ (టీఆర్టీ)లో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) పోస్టుకు అర్హులు. ఎస్‌జీటీ పోస్టులను గతంలో కేవలం డీఈడీ అభ్యర్థులతోనే భర్తీ చేయగా ప్రస్తుతం బీఎడ్ వారికి కూడా అవకాశం కల్పించారు.

జిల్లా	కళాశాలలు	సీట్లు
ఆదిలాబాద్	3	300
నిర్మల్	2	100
కుమురంభీం	1	50
మంచిర్యాల	1	50
మొత్తం	7	500

ఇవీ.. అర్హతలు

భారతీయ పౌరులై ఉండి ఇంటర్మీడియట్ తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. బీసీ, ఓసీలు ఇంటర్‌లో కనీసం 50 శాతం, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 45 శాతం మార్కులు సాధించి ఉండాలి. ఈ ఏడాది సెప్టెంబర్ ఒకటో తేదీ నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల్లో బోధన ఉంటుంది. ఉమ్మడి జిల్లాలోని ఏడు కళాశాలల్లో తెలుగు మాధ్యమంలో ఆరుచోట్ల, ఆంగ్లంలో మూడుచోట్ల, ఉర్దూలో ఒకచోట బోధనచేసే కళాశాలలున్నాయి. వంద ప్రశ్నలకు ప్రవేశపరీక్ష ఉంటుంది, ఒక్కో దానికి ఒక మార్కు చొప్పున వంద మార్కుల ప్రవేశ పరీక్షను ఆన్‌లైన్‌లో రాయాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

డీఎడ్‌లో ప్రవేశం కోసం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ నెల 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఒక్కో అభ్యర్థి రూ.500 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. టీటీటీ. ఛీఛ్ఛిఛ్ఛి. ఛిజీఛీ.జౌఠి.జీ వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థి పేరు, పుట్టినతేదీ, ఫోన్ నంబర్ తదితర వివరాలు అందజేసి ఫీజు చెల్లించిన వారికి రెఫరెన్స్ ఐడీ ఇస్తారు. అనంతరం ఆన్‌లైన్‌లో దరఖాస్తు పత్రంలోని పూర్తి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. టీఎస్ డీఈఈసెట్ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తెల్ల కాగితంపై అభ్యర్థి ఫొటో అతికించి దాని కింద సంతకం చేయాలి. ఫొటో 50 కేబీ, సంతకం 30 కేబీలోపు ఉండేలా స్కాన్ చేయాల్సి ఉంటుంది.

వారంలో పెళ్లి.. యువకుడి మృత్యువాత

- రోడ్డు ప్రమాదంలో జేఎల్‌ఎం దుర్మరణం
- ఉద్యోగానికి సెలవు పెట్టి వస్తుండగా ఘటన



సాయి(ఫైల్)



లక్సెట్టిపేట ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుని కుటుంబీకులు, బంధువులు

దండేపల్లి: మరో వారం రోజుల్లో ఆ యువకుడి పెళ్లి. తోటి ఉద్యోగులకు పెళ్లి పత్రికలు పంచి.. ఉద్యోగానికి సెలవు పెట్టి మోటార్‌సైకిల్‌పై ఇంటికి బయల్దేరాడు. హార్వెస్టర్ రూపంలో మృత్యువు వెంటాడింది. వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో మృతిచెందాడు. దండేపల్లి ఎస్సై కుందారపు ప్రసాద్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్సెట్టిపేట మండలం కొత్తకొమ్ముగూడెంకు చెందిన ఒగేటి సాయి(24) నిర్మల్ మండలం కొండాపూర్‌లో విద్యుత్ శాఖలో జేఎల్‌ఎంగా పనిచేస్తున్నాడు. అతడికి ఈ నెల 12 పెళ్లి జరగాల్సి ఉంది. గురువారం ఉదయం కొత్తకొమ్ముగూడెం నుంచి నిర్మల్‌కు వెళ్లాడు. పెళ్లి కోసం ఉద్యోగానికి సెలవు పెట్టాడు. అక్కడి మిత్రులు, తోటి ఉద్యోగులకు పెళ్లి పత్రికలు పంచి తన స్నేహితుడు మహేష్‌తో కలిసి మోటార్‌సైకిల్‌పై రాత్రి ఇంటికి బయల్దేరాడు. ఈ క్రమంలో దండేపల్లి మండలం మేదరిపేట సినిమా థియేటర్ సమీపంలో లక్సెట్టిపేట వైపు వెళ్తున్న హార్వెస్టర్ వీరి మోటార్‌సైకిల్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ కిందపడిపోయారు. సాయి తలకు తీవ్ర గాయాలు కావడంతో లక్సెట్టిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మహేష్‌కు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పెళ్లింట విషాదం..

ఒగేటి సత్తయ్య-లక్ష్మీ దంపతులకు కొడుకు, కూతురు ఉన్నారు. కూతురుకు పెళ్లి చేశాడు. ఒక్కగానొక్క కొడుకు సాయి.. పైగా విద్యుత్ శాఖలో ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్లి ఎంతో ఘనంగా చేయాలనుకున్నారు. వారం రోజుల్లో పెళ్లి ఉండడంతో ఇంట్లో పెళ్లి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇంతలో రోడ్డు ప్రమాదంలో సాయి దుర్మరణం చెందడంతో ఆ ఇంట్లో తీరని విషాదాన్ని నింపింది. పెళ్లి వేడుకలతో సంతోషంగా ఉండాల్సిన కుటుంబ సభ్యులు.. కొడుకు మరణవార్తతో రోదనలు మిన్నంటాయి. చేతికి అందివచ్చిన కొడుకు, ఉద్యోగం చేస్తూ కుటుంబానికి ఎంతో అండగా ఉంటాడని కలలు కన్న ఆ తల్లిదండ్రులకు విధి తీరని దుఃఖాన్ని మిగిల్చింది.

పెళ్లి సెలవే శాశ్వత సెలవైంది..!

విద్యుత్ శాఖలో జేఎల్‌ఎంగా పనిచేస్తున్న సాయికి పెళ్లి కుదరడంతో అక్కడ తనతో పనిచేసే తోటి ఉద్యోగులకు పెళ్లి పత్రికలు పంచాడు. పెళ్లి కోసం సెలవు తీసుకున్నాడు. రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడంతో అతడు తీసుకున్న పెళ్లి సెలవులు శాశ్వత సెలవులయ్యాయి. సాయిని పెళ్లి కొడుకుగా చూడాలనుకున్న తన తోటి ఉద్యోగులు, మిత్రులకు అతడు విగత జీవిగా కనిపించడంతో ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతం అయ్యారు. ఈ ఘటన కుటుంబీకులు, బంధువులు, మిత్రులను కలిచివేసింది.

ఆలయంలో చోరీ



వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీం సభ్యులు

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో గల బ్రహ్మంగారి మఠంలోని అష్టభుజాదేవి ఆలయంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో బుధవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. పూజారి శివయ్య మండలంలోని కనుగుట్టలో జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమానికి వెళ్లడంతో గురువారం ఆలయ తలుపులు తీయలేదు. శుక్రవారం ఉదయం గుడి తలుపులు తెరవగా వెనకభాగం తలుపులతోపాటు బీరువా ధ్వంసమైనట్లు గమనించాడు. వెంటనే స్థానికులు, పోలీసులకు సమాచారం అందించాడు. సీఐ కిరణ్ కుమార్‌తో పాటు ఎస్సై అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. బీరువాలోని 12 తులాల అమ్మవారి బంగారు ఆభరణాలు, 10వేల నగదు, పలు విలువైన వస్తువులు మాయమైనట్లు పూజారి తెలిపాడు. వేలిముద్రల సేకరణ కోసం పోలీసులు క్లూస్‌టీంను రప్పించారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నీలగిరి సాగుతో అధిక లాభాలు



రైతుకు ఒప్పంద పత్రం ఇస్తున్న అధికారులు

పెంబి: రైతులు నీలగిరి సాగు చేసి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని సిర్పూర్ పేపర్ మిల్లు డీజీఎం సురేందర్ నర్కుడే పేర్కొన్నారు. మండలంలోని లోతర్యతండా గ్రామంలో రైతులకు శుక్రవారం ఆగ్రోఫారెస్ట్రీ తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. నీటి వసతి లేకున్నా వర్షాధారంగా నీలగిరి, కాజురైన, సుబాబుల్ ఆగ్రో ఫారెస్ట్రీ మొక్కల సాగు చేపట్టవచ్చని తెలిపారు. మూడేళ్లవరకు ఎకరాకు సుమారు రూ.1.50లక్షల వరకు స్థిరాదాయాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. ఇప్పటి వరకు మండల పరిధిలో 80ఎకరాల్లో నీలగిరి సాగు చేస్తున్నట్లు తెలిపారు. మొక్కలు నాటడం, వివిధ పనుల కోసం ఉపాధిహామీ ద్వారా రూ.25వేల నుంచి రూ.30వేల వరకు ఆర్థికసహాయం అందుతుందని చెప్పారు. కార్బన్ క్రెడిట్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఎకరాకు రూ.10వేల చొప్పున అదనంగా ఖర్చులకు ఇస్తుందని తెలిపారు. నీలగిరి తోటలను కంపెనీ కొనుగోలు చేసేందుకు అగ్రిమెంట్ బాండ్ పేపర్ రైతుకు అందించనున్నట్లు తెలిపారు. సర్పంచులు సాంకీభాయి, సుదర్శన్, తానాజీ, ఎంపీవో రత్నాకర్‌రావు, ఎస్‌పీఎం మేనేజర్ సంతోష్, జిల్లా మేనేజర్ శ్రీధర్, ప్లాంటేషన్ ఆఫీసర్లు ప్రణీత్, అరుణ్, మండల కోఆర్డినేటర్ సురేందర్, ఏఈవో రాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

సీజేఎల్‌లకు రెగ్యులర్ పోస్టింగ్‌లు

- జిల్లాలో మొత్తం 134 మంది
- ప్రస్తుతం 124 మందికి పోస్టింగ్
- వెయిటింగ్‌లో పదిమంది



బాలికల జూనియర్ కళాశాలలో పోస్టింగ్‌లు తీసుకుంటున్న సీజేఎల్‌లు

నిర్మల్: ఏళ్లుగా ఎదురుచూస్తున్న కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్(సీజేఎల్)ల కల ఎట్టకేలకు నెరవేరింది. జిల్లాలోని సీజేఎల్‌లకు శుక్రవారం అర్ధరాత్రి రెగ్యులర్ పోస్టింగ్‌లలు అందించారు. జిల్లాకేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో డీఐఈఓ, నోడల్ అధికారి పరశురాం, ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు పోస్టింగ్ ఆర్డర్లను అందజేశారు.

23 ఏళ్ల తర్వాత..

సరిగ్గా 23 ఏళ్ల తర్వాత కాంట్రాక్టు లెక్చరర్‌లు రెగ్యులర్ పోస్టింగ్ అందుకున్నారు. 2000లో అప్పటి ప్రభుత్వం ఈ పోస్టులు ఏర్పాటు చేసింది. అంతకుముందు పార్ట్‌టైం లెక్చరర్ల పేరిట ఈ పోస్టులు ఉండేవి. జిల్లాలో మొత్తం 134మంది సీజేఎల్‌లు ఉన్నారు. ఇందులో సంబంధిత పోస్టులు మంజూరు ఉన్న 124మందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. పోస్టులు మంజూరు లేని మరో పదిమంది వెయిటింగ్‌లో ఉన్నారు. కొన్నేళ్లుగా తమను రెగ్యులరైజ్ చేయాలని సీజేఎల్‌లు పోరాటం చేస్తూ వస్తున్నారు. ఎన్నికల హామీలో భాగంగా సీఎం కేసీఆర్ గత నెల 30న కొత్త సచివాలయం ప్రారంభోత్సవం రోజున వీరిని రెగ్యులరైజ్ చేస్తూ ఫైల్‌పై సంతకం చేశారు. ఆ తర్వాత నుంచి గతంలో పెట్టిన కేసులు, కోర్టులు ఇచ్చిన తీర్పుల ఆధారంగా ప్రక్రియ పూర్తి చేసి, శుక్రవారం రాత్రి రెగ్యులర్ ఆర్డర్లు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఎట్టకేలకు రెగ్యులర్ పోస్టింగ్‌లను అందుకోవడంపై లెక్చరర్‌లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

న్యూట్రీ కిచెన్ కూరగాయల్లో పోషకాలు



సాంగ్విలో న్యూట్రీకిచెన్ గార్డెన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

దిలావర్‌పూర్: గ్రామాల్లో న్యూట్రీ కిచెన్ ద్వారా సాగుచేసిన కూరగాయల్లో పలురకాల పోషకాలు ఉంటాయని కలెక్టర్ వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సాంగ్వి గ్రామంలో పలు అభివృద్ధి పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ముందుగా పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించి తగు సూచనలు, సలహాలు చేశారు. గ్రామంలో ‘మన ఊరు-మన కూరగాయలు’ పేరిట న్యూట్రీకిచెన్‌ను ఆయన ప్రారంభించారు. న్యూట్రికిచెన్ గార్డెన్ ద్వారా పూర్తిగా సేంద్రీయ పద్ధతులను పాటించి మంచి పోషక విలువలతో కూడిన కూరగాయలు పొందవచ్చన్నారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును ఆయన పరిశీలించారు. సీఈవో సుధీర్‌బాబు, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, ఎంపీవో అజీజ్‌ఖాన్, సర్పంచ్ అచ్యుత్‌రావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సుభాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాలనీల పరిశీలన

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్, సాగర్ కాలనీల్లో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్‌తో కలిసి కలెక్టర్ వరుణ్‌రెడ్డి శుక్రవారం పర్యటించారు. బస్టాండ్ నుంచి సాగర్‌కాలనీ వరకు రోడ్డు సమస్య పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని గురువారం కోరారు. దీంతో ఎస్సార్ డీజీ స్కూల్ వద్ద ఇరుకుగా ఉన్న రోడ్డు, కందకాన్ని కలెక్టర్ పరిశీలించారు. సీసీ రోడ్డు ఏర్పాటుకు మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు పూర్తిచేసి త్వరగా పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రానున్న వానాకాలంలో తీసుకోవాల్సిన చర్యలపై మున్సిపల్ అధికారులతో చర్చించారు. మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, అర్బన్ తహసీల్దార్ సుభాష్‌చందర్, కౌన్సిలర్ ముజాయిద్‌చౌస్, కాలనీవాసులున్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న దేవిమురళి

లక్ష్మణచాంద: బాలలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని డీసీపీవో దేవిమురళి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో వరల్డ్ విజన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీ గ్రామంలో బాలల హక్కుల పరిరక్షణ కోసం కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాలల సంరక్షణ కమిటీలు ఆయా గ్రామాల్లోని బాలలకు వారి హక్కుల గురించి అవగాహన కల్పించాలని, బాలలకు నాయకత్వ లక్షణాలు నేర్పించాలని సూచించారు. వరల్డ్ విజన్ జిల్లా కోఆర్డినేటర్ బ్రహ్మన్న, బాలల హక్కుల కమిటీ సభ్యులు స్వదేశ్, వహీద్, మండలంలోని 18 గ్రామాల బాలల హక్కుల సభ్యులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసాతో నిరసన



బోయవాడ హనుమాన్ ఆలయం వద్ద చాలీసాను పఠిస్తున్న కార్యకర్తలు

నిర్మల్‌చైన్‌గేట్: బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని కాంగ్రెస్ కర్ణాటకలో చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం బీజేపీ నాయకులు హనుమాన్ చాలీసాను పఠిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ మాట్లాడారు. కాంగ్రెస్ ఒక వర్గానికి సంబంధించిన ఓట్లు దండుకోవడానికి ముస్లింలకు దగ్గరవుతూ భజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని అనడం యావత్ భారత సమాజానికే సిగ్గుచేటన్నారు. భారతీయ సంస్కృతి ఒక గొప్ప సంస్కృతి అని, హనుమంతుడి భక్తులు బజరంగ్‌దళ్‌ను రామరాజ్యం ఏర్పాటు చేసుకునే దిశగా ప్రయత్నిస్తుంటే ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రామరాజ్య స్థాపనకు ప్రధాని మోదీ కృషి చేస్తొంటే ఓర్వలేకే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు మెడిసమ్మె రాజు, రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు అలివేలుమంగ, కమల్ నయన్, సీనియర్ నాయకులు డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి, దళిత జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రజిని, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొన్నం నారాయణగౌడ్, బీజేవైఎం రాష్ట్ర స్టడీ సర్కిల్ కన్వీనర్ కుమ్మరి వెంకటేశ్, యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అనుముల శ్రావణ్, సీనియర్ జిల్లా నాయకులు అంజుకుమార్‌రెడ్డి, దొడ్డికింది ముత్యంరెడ్డి, మండలాధ్యక్షులు లింగారెడ్డి, శైలేశ్, విలాస్, గోవర్ధన్, అల్లం భాస్కర్, నాయకులు లవకుమార్ గౌడ్, చిన్ను, కొండాజీ రాఘవేంద్రాచారి, నరేందర్, రమేశ్, నరేశ్, భరత్ నారాయణ పాల్గొన్నారు.